25న జిపిఒలకు స్క్రీనింగ్ పరీక్ష

- సిసిఎల్ఎ కమిషనర్ నవీన్ మిట్టల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత నెల ఒకటిన విడుదల చేసిన నోటిఫికేషన్ అధారంగా గ్రామపాలన అధికారుల పోస్టులకు ఈ నెల 25న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సిసిఎల్ఎ కమిషనర్ నవీన్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు సిసిఎల్ఎ అధికారిక వెబ్‌సైట్లో త్వరలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పరీక్షకకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అభ్యర్థులకు తెలియజేస్తామని వెల్లడించారు.



మెట్రో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

పెంచిన మెట్రో ఛార్జీలు రద్దు చేయాలి

- మెట్రో కార్యాలయం వద్ద వామపక్షాల ధర్నా
- ప్రజలపై అదనపు భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెంచిన మెట్రో ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ, ఎంసిపిఐ నాయకులు సంయుక్తంగా శనివారం హైదరాబాద్ నాగోల్‌లోని మెట్రో ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎల్‌అండ్‌టి యాజమాన్యానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి ఎం.వెంకటేష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. మెట్రో నష్టాలకు యాజమాన్యమే కారణమని, నష్టాలను పూడ్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని అన్నారు. ఛార్జీలు పెంచడం సరైనది కాదని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌అండ్‌టి యాజమాన్యం ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి భిన్నంగా ఇప్పటికే ఛార్జీలు పెంచి ప్రయాణికుల నుంచి అదనంగా వసూలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో రైల్వే నిర్వహణ ఖర్చు సగం ప్రయాణికుల నుంచి, మిగిలిన సగం రియల్‌ఎస్టేట్, యాడ్స్, ఇతర రిటైల్ వ్యాపారాల ద్వారా సమకూర్చుకోవాలని ఉందని వివరించారు. దానికి భిన్నంగా చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఫెయిర్ ఫిక్సేషన్ కమిటీ మెట్రో నష్టాల్లో ఉందని, చార్జీలకు సిఫార్సు చేయడంతో పెంచారని చెప్పారు. ప్రయాణికుల ద్వారా ఏడాదికి రూ.650 కోట్లు వస్తుంటే.. యాడ్స్ ఇతర వనరుల ద్వారా రూ.250 కోట్లు మాత్రమే మెట్రో ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన 269 ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోలేక, నష్టాలు పూడ్చుకోవడానికి ప్రయాణికులపై భారం వేయడం సరైనది కాదన్నారు. దేశంలోనే చార్జీలు ఎక్కువగా ఉన్న మెట్రో సర్వీస్ హైదరాబాద్ అని, ఇప్పుడు మళ్లీ పెంచడంతో మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌అండ్‌టి యాజమాన్యం ఏకపక్షంగా పెంచిందా? లేదా దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత్ర ఉందా? అదనేదానిపై ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు.

సిపిఐ నాయకులు స్టాలిన్ మాట్లాడుతూ.. నష్టాలు వస్తున్నాయని ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు హన్మేష్ మాట్లాడుతూ.. మెట్రో రైలు పర్యావరణానికి మేలు చేసేదని, ప్రజా రవాణాను లాభనష్టాలతో చూడకూడదని, అవసరమైతే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఝాన్సీ మాట్లాడుతూ.. ఎల్‌అండ్‌టి యాజమాన్యం ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తోందన్నారు.


ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్‌టిసి బస్సులో మంత్రి పొన్నం ప్రయాణం

- సౌకర్యాలపై ప్రయాణికుల ఆరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం రవాణాశాఖ బలోపేతానికి కృషి చేస్తుందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈవీ వాహనాల సంఖ్య పెంచుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి శనివారం పంజాగుట్ట నుంచి లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ వరకు ఆర్‌టిసి బస్సులో మంత్రి టికెట్ తీసుకుని ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈవీ వాహనాల సంఖ్య పెంచామని, బస్సుల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రతి రోజూ ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు ఇతర అవసరాల నిమిత్తం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. తమకు నెల వారీగా కొంత డబ్బు ఆదా అవుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. నగరంలో పెద్ద సంఖ్యలో ఆర్‌టిసి బస్సులు వచ్చాయని తెలిపారు. ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ మా ఆడబిడ్డల సొంతం

- అభివృద్ధి సంక్షేమ పథకాల్లో వారికే పెద్దపీట
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి తీరుతాం
- వి హబ్ విమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆర్థిక క్రమశిక్షణ మా ఆడబిడ్డల సొంతం. సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో వారికే పెద్దపీట వేస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి తీరుతాం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో వి హబ్ విమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగతి సాధిస్తోందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రంగాల్లో వారికి ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. "మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆడబిడ్డలకు అప్పగించాం. విద్యార్థుల యూనిఫాం కుట్టుపనిని మహిళా సంఘాలకు అప్పగించి వారికి భరోసా అందించాం. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహిస్తున్నాం. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాలను చేసేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. అదానీ, అంబానీలకు పరిమితమైన వ్యాపారాలను మహిళలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. శిల్పారామంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు స్టాళ్లు కేటాయించాం' అని అన్నారు. ఇప్పటికే వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని మహిళలకు అప్పగించామని, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తే మరో వెయ్యి మెగావాట్ల వ్యాపారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వాటిని రాష్ట్రానికి వచ్చే అతిథులకు బహుమతులుగా అందిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డలను ప్రోత్సహించడంలో ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. రూ.16 లక్షల కోట్లను కార్పొరేట్ కంపెనీలకు అప్పు ఇస్తే ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్లారని, కానీ ఆడబిడ్డలకు అప్పు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగ్గొట్టకుండా వడ్డీతో సహా చెల్లిస్తున్నారని కొనియాడారు. అదే స్ఫూర్తితో మహిళా సంఘాలు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. చైనా, పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినపుడు ఇందిరాగాంధీ మహిళా శక్తిని ప్రపంచానికి చాటారని గుర్తు చేశారు. దేశాన్ని గెలిపించిన మహిళా శక్తిని కాంగ్రెస్ ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదని అన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం వారిని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలబెట్టేందుకు కృషి చేస్తోందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

సివి ఆనంద్‌ను అభినందించిన సిఎం రేవంత్

ప్రపంచానికి తెలంగాణ రోల్ మోడల్

వివిధ రంగాల్లో ప్రపంచానికి తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నది తన ఆకాంక్ష అని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీస్ సమ్మిట్‌లో ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్స్ అవార్డును హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ సివి ఆనంద్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణలో 138 దేశాలతో పోటీ పడి తెలంగాణ పోలీస్ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానాన్ని సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ సివి ఆనంద్‌కు, ఆయన బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం అనే కలను సాకారం చేయడానికి కృషి చేస్తున్న ప్రతి పోలీస్‌కు మద్దతుగా ఉంటానన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్లను వారి కాలేజీల నుంచి తీసుకోవాలని సూచించారు. అధికారిక వెబ్‌సైట్ షుష్‌ప్రఎఱ.ఎప్ప్రప్రిఱ.ఱఅ నుంచి కూడా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కోరారు.

BEFORE THE DEPUTY COMMISSIONER, BENGALURU URBAN DISTRICT, AT BENGALURU
REV. PET. No. 224 /2023 In R.A. (BE) No.541/2022

BETWEEN: Sri. B.J. Sandeep and another ...Petitioners
AND: The Tahasildhar, Bengaluru East Taluk and Others ...Respondents

SUMMONS TO BE SERVED ON RESPONDENTS NOS. 3, 5, 6 & 9

3. Sri. B.N. Vasudevareddy, aged about 67 years, S/o P. Narayanappa, Residing at No.401, Bellandur Outer Ring Road, Next to Vakil Gardenia Apartment, Bellandur, Bengaluru-560 103
5. Smt. N. Shantha, aged about 50 years, W/o Sri Raghavendra, Residing at No.85, East Anjaneya Temple Street, Basavanagudi, Bengaluru - 560 004
6. Smt. V. Subba Lakshmi, Major by age W/o V.Y.S. Sharma, Residing at No.2812, 8th Main Road, Siva 'E' Block, Rajajinagar II Stage, Bengaluru South Taluk, Bengaluru-560010
9. Sri K. Rajashekar, aged about 46 years, S/o K. Shivananda Murthy Residing at No.221, Balarsal Housing Society Road, No.5, Mahindra Hills, Secunderabad.

WHEREAS, the Petitioners have instituted the above petition for the relief setting aside the order dated 14.12.2022 passed by the 2nd Respondent in RA (BE) No.541/2022 and other consequential reliefs.

SCHEDULE PROPERTY

Land property bearing Sy No.22/1, situated at Kalkondarahalli Village, Bengaluru East Taluk, Bengaluru.

You are hereby summoned to appear in this Court in person or by a Pleader on 04-06-2025 at 03.00 P.M. to answer the same, failing which proceedings will be disposed off ex-parte.

Given under my hand, signature and seal of this Hon'ble Court on this the 16-04-2025.

By order of the Court, Deputy Commissioner, Bengaluru Urban District, Bengaluru

Advocate For Plaintiff:
V.B. SHIVAKUMAR
VBS Law Inc.
No. 230, 1st Floor, Yajaman Building
4th Main road, Chamarajpet
Bangalore-560018.

వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్ర బృందం తనిఖీ

- ఆస్పత్రుల పర్మిషన్ సర్టిఫికెట్లు, పత్రాల పరిశీలన


ఫైళ్లను పరిశీలిస్తున్న వైద్య బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లాలోని ఆస్పత్రులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ తీవ్రంగా స్పందించింది. డాక్టర్ రాథోడ్ నేతృత్వంలోని బృందం శనివారం ఆకస్మికంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ కోటాచలం సమక్షంలో పర్మిషన్ సర్టిఫికెట్లు, అనుమతుల పత్రాలు, వైద్యాధికారుల ప్రమాణాలు వంటి కీలకమైన డాక్యుమెంట్లను పరిశీలించింది. నాలుగు ఆస్పత్రులపై పూర్తి సమాచారం సేకరించింది. హైదరాబాద్‌కు తీసుకెళ్లింది. త్వరలో ఈ నివేదికను ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్‌కు సమర్పించి, ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు అధికార బృందం వెల్లడించింది. వారం రోజులుగా సూర్యాపేటలోని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులతోపాటు డిఎంహెచ్‌ఓ కోటాచలంపై ఆరోపణలు వస్తుండటంతో.. సమగ్ర సమాచారం సేకరించేందుకు ఈ బృందం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఆస్పత్రుల పర్మిషన్‌కు సంబంధించిన అర్హత పత్రాలు, సంబంధిత వైద్యాధికారుల అనుమతి సర్టిఫికెట్లు వంటి కీలక డాక్యుమెంట్లను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అనే దానిపై సమగ్రంగా నివేదిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా నాలుగు ఆస్పత్రులకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక పత్రాలను సేకరించి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నివేదికను రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్‌కు సమర్పిస్తామని, అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ స్థాయిలో తదుపరి చర్యలు తీసుకుంటామని అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ తెలిపారు. ఈ బృందంలో పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్, డిప్యూటీ సీఎస్‌పీసీ ఎన్‌డీటీ డాక్టర్ సుమిత్రారాణి, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్వేతా మోహన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ తరలొచ్చిన జనం

- ఖమ్మం నగరపాలక సంస్థ ఎదుట సిపిఎం భారీ ధర్నా
- వేలాదిగా దరఖాస్తుల సమర్పణ
- సంక్షేమం, అభివృద్ధి ఫలాల కోసం డిమాండ్
- కార్పొరేషన్ అధికారులకు సిపిఎం విజ్ఞప్తి
- సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం : పోతినేని


ఖమ్మం నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేశారు. వేలాదిగా జనం తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ పథకాల దరఖాస్తులతో కార్యాలయం ఎదుట బైఠాయించారు. దాదాపు మూడు గంటలపాటు ఈ ధర్నా కొనసాగింది. నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫివుల్లాఖాన్ బయటకు వచ్చి దరఖాస్తులు తీసుకోవడంతోపాటు సిపిఎం చేసిన సర్వేలో వెలుగు చూసిన సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేయర్ పునుకొల్లు నీరజకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం అధ్యక్షతన జరిగిన ధర్నాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, వివిధ పథకాల కోసం దరఖాస్తులు పెట్టడంతోనే ప్రభుత్వం కదలదని, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో పదేళ్లు సాగదీసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం అదే ధోరణి అవలంబిస్తోందని అన్నారు. గత ప్రభుత్వాన్ని ఓటుతో పక్కన పెట్టారని గుర్తు చేశారు. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, అందాల పోటీలకు ఉన్న డబ్బులు ఆరు గ్యారంటీల అమలు చేయడానికి లేవా? అని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, పింఛన్ల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు పారదర్శకంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, డివిజన్ కమిటీ నాయకులు నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, ఉమేందర్, నాగసులోచన, వజినేపల్లి శ్రీనివాస్, వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీర్, కార్పొరేటర్ యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అద్దంకి

O.S. No:11/2001

Between :
యర్రా అంజయ్య (Died) & 11others.... వాదులు
And
ముట్లూరి తిరుపాలు& 28 others..... ప్రతివాదులు

To
1) పాలెపోగు పెద్ద కోటయ్య (28వ ప్రతివాది) తండ్రి తిరుపాలు, పాస్టర్ ఇన్ ఆల్ఫాల్, భగత్ సింగ్ గ్రూప్, హెబ్రాన్ చర్చ్, బొల్లారం, హైదరాబాద్ (సిటీ సివిల్ కోర్ట్)
2) పాలెపోగు సులేమాన్ (29వ ప్రతివాది) తండ్రి తిరుపాలు, పాస్టర్, భగత్ సింగ్‌గ్రూప్, హెబ్రాన్ చర్చ్, మలక్‌పేట్, హైదరాబాద్ (సిటీ సివిల్ కోర్ట్)

పై నంబరు దావాలో పైకోర్టు వారు మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకోకుండా ఇబ్బంది కలుగ చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు మీకు జారీ అగునట్లుగా పైకోర్టువారు ఉత్తర్వులు దయచేసినారు. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టులో తే 16-06-2025 దిన ఉదయం 10.30 గంటలకు మీరు గాని, మీతరపు వకీలుగాని హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును తెలుసుకోవలెను.

వాయిదా తేదీ : 16-06-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి
17-05-2025

ఇట్లు
వాది తరఫు న్యాయవాది
నాదెండ్ల హరిబాబు
సెల్ నెం:94415 21613

IN THE HONOURABLE COURT OF THE DISTRICT CONSUMER DISPULE REDRASSAL COMMISSION, VIZIANAGARAM
IA 30/2025 CC 4/2025

Between :
Adduri Mohana Rao S/o Late Papi Naidu, R/o Gopalavalasa Village, Therlam Mandal, Vizianagaram Dist. ....Petitioner/Complaint
And :
Agri Gold Form Estates India (P) Ltd, Vijayawada and anothers .....Respondents/Opposite Parties

NOTICE

1. Agri Gold Form Estates India (P) Ltd, Administration Office, Agrigold House, Plot No-6, Dr.No.40-6-3, Old Revenue Colony, Nimmagadda Soma Sankara Rao Street, Labbipeta, Vijayawada, Andhra Pradesh. represented by its Authorised Person.
2. Agri Gold Towers 6-3-680/A,B, The Kurmanson lane, Near Somrajugudu Circle, Hyderabad - 82 represented by its Authorised Person.

ఇందలి పిటిషనరు పై కోర్టు ఇందలి ప్రతివాదుల వద్ద నుండి రావలసిన సొమ్మును రాబట్టుట కొరకు పై కేసును దాఖలు చేసియున్నారు. ఇందలి ప్రతివాదులకు పలు పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ అవి బయలు జరుగలేదు. దీనితో పేపరు ప్రకటన ద్వారా నోటీసు తెలుపుతూ తే 9-6-2025దీ కేసును వాయిదా నిమిత్తం వాయిదా అయియున్నది. కావున ఇందలి ప్రతివాదులు పై కోర్టు ఎదుట స్వయంగా గాని, లాయరు ద్వారా గాని తే 9-6-2025దీ ఉదయం 10-30 గంటలకు హాజరై తమ వున్న ఆధారాలు ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనిచో మీ పరోక్షమందు పరిష్కారం తీర్మానం జరుగును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పై కోర్టు ఆర్డర్

Adduru Mohana Rao
Advocate/Complaint
Gopalavalasa, Therlam (M)
Vizianagaram Dist


కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్న భట్టి విక్రమార్క

సరస్వతి పుష్కరాలు నిర్వహించడం సంతోషకరం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరస్వతి నది అంతర్వాహిని అయిన త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను నిర్వహించడం సంతోషకరమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం కాళేశ్వరం చేరుకున్న మంత్రి.. త్రివేణి సంగమంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మక్కన్‌సింగ్‌తో కలిసి పుష్కర స్నానం చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ సువిశాలంగా ఉందంటూ, పాడి పంటలతో వర్ధిల్లాలని స్వామి వారిని వేడుకున్నట్టు తెలిపారు. సరస్వతి పుష్కరాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలు మహాద్భుతం : భట్టి విక్రమార్క

సరస్వతి పుష్కరాలు గోదావరి, ప్రాణహిత, సరస్వతి అంతర్వాహిని మూడు నదుల సంగమం అని.. 12 ఏళ్లకోసారి వచ్చే పుష్కరాలు కాళేశ్వరంలో అద్భుతంగా జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్‌లో సోదరుడు మల్లు ప్రసాద్‌తో కలిసి పెద్దలకు పిండప్రదానం నిర్వహించారు. అనంతరం సరస్వతి పుష్కర ఘాట్‌లో స్నానమాచరించి కాళేశ్వర శివాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ సిఎంతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు మక్కన్‌సింగ్, గండ్ర సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వర్షానికి కూలిన టెంట్లు..

కాళేశ్వరంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో టెంట్లు కూలిపోయాయి. దీనిపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ స్వయంగా పర్యవేక్షించారు. రాత్రి నుండి ఉదయం సరస్వతి ఘాట్, టెంట్ సిటీ, స్టాల్స్ వంటి ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. వర్షం కారణంగా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యలు అందిస్తున్నాయి.

చాదర్‌ఘాట్‌లో భారీ చోరీ

- 67 తులాల బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఆజంపురా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఓ ఇంట్లో వృద్ధులు మాత్రమే ఉండటాన్ని గమనించిన దుండగులు.. లోపలికి చొరబడి 67 తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట్ రైల్వే స్టేషన్ పక్కనే నివాసం ఉంటున్న మహమ్మద్ షైముద్దీన్ తన భార్యకు అనారోగ్యంగా ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం రాత్రి ఆయన వృద్ధ తల్లిదండ్రులు మాత్రమే ఇంట్లో ఉన్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కిటికీ ద్వారా ఇంట్లోకి ప్రవేశించారు. వృద్ధులు ఉన్న గదికి బయట నుంచి గడియ పెట్టారు. బీరువాలో ఉన్న 67 తులాల బంగారం, వెండి, రూ2.50 లక్షలు, సామ్‌సంగ్ ఎస్-9 మొబైల్ ఫోన్, రాడో వాచ్, వీడియో కెమెరా ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికొచ్చిన షైముద్దీన్ చోరీ జరిగినట్లు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి.. వేలిముద్ర నిపుణులను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. దొంగలను పట్టుకునేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎసిపి బ్రహ్మ మురారి తెలిపారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 43 అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001, Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుపు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

[illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

స్థలం : విజయవాడ
తేది : 12-05-2025

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అంబేద్కర్, గద్దర్‌ది ఒకే సిద్ధాంతం

- బక్కి వెంకయ్య, వెన్నెల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే.. ఆ రాజ్యాంగంలో ఉన్న విధివిధానాలు అమలుపరిచే విధంగా పోరాటం చేసిన వ్యక్తి ప్రజా గాయకుడు గద్దర్ అని.. వారిద్దరిదీ ఒకే సిద్ధాంతమని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మామిడ్యాల గ్రామంలో అంబేద్కర్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎడ్ల సత్తయ్య, సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్, గద్దర్ విగ్రహాల ఏర్పాటు కోసం శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇద్దరు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన అంబేద్కర్ గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాదు.. వారి ఆశయాలను కూడా యువత ముందు ఉండాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, బడుగు బలహీన వర్గాల వారు ఉన్నత చదువులు చదివి రాజ్యాంగ నిర్మాత కోరుకున్న విధంగా ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు.

20న డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

- ఆర్‌టిసి కార్మికులకు ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూయు పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలు వ్యతిరేకిస్తూ, లేబర్ కోడ్‌ల రద్దు సహా 17 డిమాండ్ల సాధన కోసం మే 20న జరగాల్సిన జాతీయ సమ్మెను జులై 9కి జాతీయ కార్మిక సంఘాలు వాయిదా వేశాయని టిజిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) తెలిపాయి. అయితే, మే 20న సమ్మెకు వెళ్లడం లేదనీ, ఆ రోజున సమస్యల పరిష్కారం కోరుతూ 'పోరాట దినం' పాటిస్తూ, కార్మికులు డిమాండ్ బ్యాడ్జ్‌లు ధరించి విధులకు హాజరు కావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వివిఎస్ రావు, ఎస్‌డబ్ల్యూయూ వైస్ చైర్మన్ జి అబ్రహం, ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి శనివారం సంయుక్త ప్రకటన ద్వారా తెలిపారు. జులై 9 సమ్మెకు దాదాపు 50 రోజుల సమయం ఉన్నదనీ, ఆర్టీసీలో సమ్మె నోటీసు జారీ చేసిన సంఘాలతో పాటు మిగిలిన సంఘాలు కూడా సమ్మెలో భాగస్వామ్యం అయ్యేలా నిర్ణయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలి. ఎమ్‌వి యాక్ట్ -2019లో సవరణలు చేయాలి అనే డిమాండ్లను బ్యాడ్జీలపై ముద్రిస్తున్నామని వివరించారు.

పిఓకె అంశం లేకుంటే చర్చలు అనవసరం

- తిరంగా యాత్రలో వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాక్ ఆక్రమిత కశ్మీర్ అంశంపై తప్పితే పాకిస్తాన్‌తో చర్చలు అనవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో సైన్యానికి మద్దతుగా సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఫోరం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన తిరంగా యాత్రను నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అందులో వెంకయ్యనాయుడు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బిజెపి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. భారత్ శాంతి కోరుకునే దేశమని నొక్కి చెప్పారు. మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికీ హైదరాబాద్‌లో ఉగ్రవాదులు స్లీపర్ సెల్స్‌గా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, డికె అరుణ, ఈటల రాజేందర్ మాట్లాడారు.

జూన్ 6 నుంచి జయశంకర్ బడిబాట

- రాష్ట్రవ్యాప్తంగా 19 వరకు నిర్వహణ
- బడులు తెరిచిన మొదటిరోజే పుస్తకాలు, యూనిఫారాల అందజేత
- విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని వచ్చేనెల ఆరో తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి శనివారం మార్గదర్శకాలను విడుదల చేశారు. వచ్చేనెల 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని తెలిపారు. మొదటిరోజు గ్రామసభ నిర్వహించాలని సూచించారు. ఏడున ప్రతి ఇంటినీ సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలని కోరారు. ఎనిమిది నుంచి పదో తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలనీ, డ్రాపౌట్ పిల్లలను గుర్తించాలని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలని వివరించారు. 11న బడిబాట ప్రారంభం నుంచి నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు. వచ్చేనెల 12న పాఠశాలల పున:ప్రారంభం రోజే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని సూచించారు. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలను అందించాలని అధికారులను ఆదేశించారు. 13న సామూహిక అక్షరాభ్యాసం బాలల సభను నిర్వహించాలని కోరారు. 16న ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ దినోత్సవం నిర్వహించాలని తెలిపారు. 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలని తెలిపారు. 18న తరగతి గదుల డిజటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకంపై ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలని సూచించారు. జూన్ 19న జయశంకర్ బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించాలని కోరారు. బడిబాటను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల డీఈవోలు, ఈవో-డీపీవోలు, సమగ్ర శిక్ష అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని నరసింహారెడ్డి తెలిపారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఆవాసాల్లో బడిఈడు పిల్లలను గుర్తించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచాలనీ, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ), అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు (ఎఎపిసి) సహాయం తీసుకుని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (విఈఆర్)ను అప్‌డేట్ చేయాలనీ, పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ (పిఇఎన్)ను అప్‌డేట్ చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరో తరగతి, ఎనిమిదో తరగతిలో చేర్పించాలని వివరించారు. తక్కువ పిల్లలున్న పాఠశాలలను గుర్తించి వాటిలో పిల్లల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలనీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సహాయంతో వారి వయసుకు తగ్గ తరగతిలో చేర్పించాలని పేర్కొన్నారు. బాలికల నమోదును పెంచాలని కోరారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పౌరసమాజంలో విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) గురించి అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్లు, డిఇఒలు, ఎంఇఒలు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు ముఖ్యపాత్ర పోషించాలని కోరారు.

మెట్రో రైల్ టికెట్ ధరల పెంపును వెనక్కి తీసుకోవాలి

- సిఎంకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రోరైల్ టికెట్ ధరల పెంపును తక్షణం వెనక్కి తీసుకోవాలని బిఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సిఎం రేవంత్‌రెడ్డికి హైదరాబాద్ నగర బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, టి పద్మారావుతో పాటు మొత్తం 11 మంది ఎమ్మెల్యేలు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ దేశంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరాల్లో ఒకటని తెలిపారు. కోటికి పైగా జనాభా ఉన్న మహానగరంలో లక్షలాది మంది ప్రజలు, ఉద్యోగస్తులు, విద్యార్థులు మెట్రో రైలును తమ ప్రధాన రవాణా మార్గంగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో టికెట్ ధరల పెంపు వల్ల మెట్రోలో ప్రయాణించే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద, మధ్య తరగతి వారిపై తీవ్ర భారం పడిందని గుర్తు చేశారు.

ఇప్పటికే హైడ్రా, మూసీ పేరిట పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, వీధి వ్యాపారులను సైతం రోడ్డున పడేసి వారందరి బతుకులను దుర్భరం చేశారని తెలిపారు. మరోవైపు కమీషన్ల వేటలో రియల్ ఎస్టేట్‌ను పూర్తిగా కుదేలు చేసి అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పించే రంగాలను దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇంజన్ లాంటి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీకి కోలుకోలేని నష్టం చేసి ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని గుర్తు చేశారు. ఇన్నిరకాల సవాళ్ల మధ్య పేద, మధ్యతరగతి జీవితాలపై మెట్రో ఛార్జీల రూపంలో భారం మోపడం అత్యంత దుర్మార్గమైందని విమర్శించారు.

బొగ్గు ఉత్పత్తిలో ఆటంకాలు వద్దు

- సింగరేణి సిఎండి ఎన్ బలరాం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తిలో ఆటంకాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి సిఎండి ఎన్ బలరాం అధికారుల్ని ఆదేశించారు. రోజుకు 2.2 లక్షల టన్నులబొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని లక్ష్యాలను నిర్దేశించారు. శనివారంనాడాయన కొత్తగూడెం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున భారీ వర్షాలతో ఓపెన్ కాస్ట్ క్వారీల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందనీ, దానికోసం ముందస్తుగా సంపులలోని నీటిని తొలగించడం కోసం తగినన్ని మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఈఅండ్‌ఎమ్‌డి సత్యనారాయణరావు, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భారీ ఈదురు గాలులతో వర్షం

- పిడుగు పడి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం రాత్రి, శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. లారీల కొరతతో కాంటాలు కాక తమ ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలుచోట్ల ఇండ్ల కప్పులు లేచిపోయాయి. చెట్లు నేలకూలాయి. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పడాలపల్లి గ్రామంలో పిడుగు పడి వెంగలి ప్రసాద్ (15), నడిపల్లి యశ్వంత్ (13) ప్రాణం కోల్పోయారు. మరో బాలుడు ముఖద్దం రవికిరణ్ (14) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకెళ్లగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పడాలపల్లి గ్రామానికి చెందిన వెంగలి ముత్యాలు కొడుకు వెంగలి ప్రసాద్, నడిపల్లి యశ్వంత్, రవికిరణ్‌తో పాటు మరికొంతమంది గ్రామ శివారులో గల పెద్దకుంట వద్ద క్రికెట్ ఆడుతున్నారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీంతో వెంటనే వారు పక్కనే ఉన్న చింతచెట్టు కిందకు వెళ్లారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో వెంగలి ప్రసాద్, నడిపల్లి యశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందారు. ముఖద్దం సుధాకర్ కొడుకు రవికిరణ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంగలి పప్రసాద్ ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణులు కాగా, యశ్వంత్ 9వ తరగతి చదువుతున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరించి, మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివానందం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామం పడాలపల్లి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఈదురు గాలుల బీభత్సం

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ(జి), ధర్మసాగర్‌లో శుక్రవారం రాత్రి ఈదురుగాలుల ధాటికి ఇంటిపై కప్పులు, రేకులు ఎగిరిపడ్డాయి. మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు రాత్రంతా చీకట్లో గడిపారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం నానా అవస్థలు పడ్డారు.

మహిళలకు ఆర్థిక స్వావలంబన

- రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ బంకుల ఏర్పాట్లకు ప్రణాళికలు
- పైలట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో ఐదు మహిళా పెట్రోల్ బంకులు
- రూ.2 కోట్ల వ్యయంతో సంగారెడ్డిలో నిర్మాణం పూర్తి
- సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు నిత్యావసరాల సరఫరా బాధ్యతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వ్యాపార రంగంలో రాణించేందుకు వీలుగా భారీ ప్రణాళికలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మహిళా సమాఖ్యలు వ్యాపారాలు చేసేందుకు జిల్లా కేంద్రాల్లో వాణిజ్య భవన సముదాయాల్ని సమకూర్చింది. ముందుగా మహిళా శక్తి పథకం కింద తొలిసారిగా మహిళా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయబోతుంది. పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో 5 పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే సంగారెడ్డిలో బంకు నిర్మాణం పూర్తయ్యింది. సిఎం రేవంత్‌రెడ్డి మరో అడుగుముందుకేసి రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్స్‌తో పాటు గురుకులాలకు కూడా విద్యార్థులకు అవసరమైన నిత్యావసరాలు, కాస్మోటిక్స్‌ను సరఫరా చేసే అవకాశాన్ని మహిళా సంఘాలకు అప్పజెప్పాలని నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు హాస్టళ్లు, గురుకులాలకు అవసరమైన నిత్యావసర సరుకుల్ని స్వయం సహాయక మహిళా సంఘాలు సరఫరా చేసేందుకు వీలుగా సెర్ప్ ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

స్వయం సహాయక మహిళా సంఘాల పనితీరు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. వ్యక్తిగత పొదుపు, రుణాల చెల్లింపు విషయంలో వందకు వంద శాతం సక్సెస్ సాధిస్తున్నాయన్న పేరుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపుల్లో మహిళా సంఘాలే నెంబర్ వన్‌గా నిలుస్తున్నాయి. బ్యాంకు రుణాలు పొందిన మహిళలు ఇప్పటి వరకు చిరు వ్యాపారాలకే పరిమితమయ్యారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులుగా ఉన్న మహిళలకు మరింత ఆర్థిక పరిపుష్టిని చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా కొన్ని నిర్ణయాలు చేసింది. మహిళా సంఘాలను పెద్ద పెద్ద వ్యాపారాల్లోనూ రాణించేందుకు వీలుగా రాష్ట్రంలో తొలిసారిగా సంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, ఆందోల్, నారాయణఖేడ్ పట్టణాల్లో 5 మహిళా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయబోతుంది. తొలుత సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉన్న పాత వెలుగు కార్యాలయం ఆవరణలో 8 గుంటల స్థలాన్ని కేటాయించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పెట్రోల్ బంక్‌ను ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు పనులు పూర్తి చేస్తున్నారు. మిగతా నాలుగు కేంద్రాల్లోనూ మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకుల కోసం స్థల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. పట్టణ కేంద్రాల్లో జన సమూహం ఉన్న.. పక్కన పెట్రోల్ బంకుల్లేని ఏరియాల్లో ప్రభుత్వ స్థలాల్ని సేకరిస్తున్నారు. పెట్రోల్ బంకుల వ్యాపారం, నిర్వహణ పెద్ద పెద్ద వ్యాపారులే చేశారు. కొంత కాలంగా జైళ్లు, పోలీస్ బెటాలియన్లు, జిల్లా కేంద్రం పోలీస్ విభాగం ఆధ్వర్యంలోనే పెట్రోల్ బంకుల నిర్వహణ చేస్తున్నాయి. ఇక నుంచి మహిళా పెట్రోల్ బంకులు కూడా రానున్నాయి. సంగారెడ్డిలో ఐఓసీఎల్‌తో 20 ఏండ్ల ఒప్పందం కుదుర్చుకున్నారు. బంక్ నిర్వహణ కోసం 15-20 మంది టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన యువతులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. బంకు పక్కనే వాణిజ్య భవన సముదాయాన్ని నిర్మించి మహిళా సమాఖ్యకు కేటాయించడం వల్ల తక్కువ అద్దెలతో మహిళలు వ్యాపారాలు చేసుకుంటారనేది ప్రభుత్వం ఆలోచన.

హాస్టళ్లు, గురుకులాలకు నిత్యవసరాల సరఫరా బాధ్యత

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లు 2000 వరకు ఉన్నాయి. వీటిల్లో 3 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు సొసైటీల పరిధిలో 1000 గురుకులాలున్నాయి. వీటిల్లోనూ మూడు లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. సుమారు 6 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన నిత్యావసరాలు, కాస్మోటిక్స్, ఇతర వస్తువుల్ని గుత్తేదార్లు సరఫరా చేస్తున్నారు. చాలా వరకు ముదిరిన కూరగాయలు, కుళ్లిన పండ్లు, నాణ్యతలేని పప్పులు, నూనెలు, గుడ్లు, చికెన్, మటన్ ఇతర వస్తువుల్ని సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దాంతో రాష్ట్రంలో వందలాది గురుకులాలు, హాస్టళ్లలో నాసిరకం వస్తువుల వల్ల ఫుడ్ పాయిజన్‌కు గురై ఈ ఏడాది 500 మంది వరకు ఆస్పత్రి పాలయ్యారు. ఈ పరిస్థితుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన సరుకుల్ని అందించడంతో పాటు మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి బాధ్యతను మహిళా సంఘాలకు ఇవ్వనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సెర్ప్ సీఈఓ నేతృత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మహిళలకు అప్పజెప్పడం వల్ల స్థానికంగా తాజా కూరగాయలు, పండ్లు అందనున్నాయి.కాస్మోటిక్స్ కోసం ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అవసరమైన వస్తువుల్ని కొనుగోలు చేసుకునే వీలుంటదని ప్రభుత్వం భావిస్తుంది. అయితే విద్యార్థులకు కావాల్సిన ప్లేట్స్, గ్లాసులు, బాక్సులు, టై, బెల్ట్, బకెట్లు, బూట్లు, స్పోర్ట్స్ డ్రెస్‌లకు మాత్రం రాష్ట్ర స్థాయిలో టెండర్లు పిలవనున్నారు.

త్వరలోనే పెట్రోల్ బంకు ప్రారంభం: జంగారెడ్డి, ఎపీడీ, డీఆర్‌డీఓ సంగారెడ్డి

సంగారెడ్డి బైపాస్ రోడ్డులో నిర్మించిన మహిళా పెట్రోల్ బంకును రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభం కానుంది. రూ.2 కోట్ల వ్యయంతో బంకు నిర్మాణం పూర్తయ్యింది. ఐఓసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నందున మంచి వ్యాపారం సాగనుంది. మిగతా చోట్ల కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

జర్నలిస్టు నేత విక్రమరావుకు టిడబ్ల్యుజెఎఫ్ ఘన నివాళి

ప్రజాశక్తి - కల్చరల్

జర్నలిస్టుల ఉద్యమ జాతీయ నాయకుడు, సీనియర్ పాత్రికేయుడు కోటంరాజు విక్రమరావు అకాల మరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఐఎఫ్‌డబ్ల్యుజె, టిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో సంతాప సభ జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సభకు పలువురు సీనియర్ జర్నలిస్టులు హాజరై విక్రమ్ రావుకు నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల సాధనకై అనేక పోరాటాలు చేసిన విక్రమ్ రావు జీవితం పాత్రికేయులకు ఆదర్శమని కొనియాడారు. విక్రమ్‌రావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు పాత్రికేయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌డబ్ల్యుజె కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగె రఘు, బి రాజశేఖర్, కార్యదర్శులు ఈ.చంద్ర శేఖర్, తన్నీరు శ్రీనివాస్, పలువురు జర్నలిస్టులు విక్రమ్‌రావుకు నివాళులర్పించారు.

చీలిక దిశగా బిఆర్‌ఎస్‌ఎల్‌పి

- ఏలేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హరీశ్‌రావు నేతృత్వంలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి చీలిక దిశగా ప్రయాణిస్తోందనీ, ఆయన వైపు 13 మంది, కవితవైపు నలుగురు ఎమ్మెల్యేలున్నారని బిజెపి ఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. రజతోత్సవ సభలో హరీశ్‌రావు, కవిత డమ్మీలుగా మారారని తెలిపారు. బిఆర్‌ఎస్‌లో కవిత ఒంటరైందన్నారు. బిఆర్‌ఎస్ సర్కార్ విఫలమైందని మాట్లాడటం, పదవులు, ఆస్తులన్నీ కెటిఆర్‌కెనా అని లేఖ రాయడం కవిత వ్యూహాత్మకమేనని చెప్పారు. పార్టీలో కెటిఆర్ తొక్కేస్తున్నాడనీ, కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని సన్నిహితుల వద్ద ఆరోపిస్తోందని అన్నారు. కెసిఆర్ ఒత్తిడితోనే కెటిఆర్‌కు అధ్యక్ష పదవి ఇచ్చినా ఓకే అని హరీశ్‌రావు చెప్పారన్నారు. బిఆర్‌ఎస్‌ఎల్‌పి తనకే ఇవ్వాలని హరీశ్‌రావు పట్టుబడుతున్నారని తెలిపారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి శబరీష్

20 మంది మావోయిస్టుల అరెస్ట్

- భారీగా ఆయుధాలు స్వాధీనం
- ఎస్‌పి సమక్షంలో మరో ఎనిమిది మంది లొంగుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు పోలీసులు 20 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌పి సమక్షంలో మరో ఎనిమిది మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. వారందరినీ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి డాక్టర్ శబరీష్ విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి శబరీష్ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల సమీపంలో గల వెంకటాపురం, వాజేడు, పేరూరు పోలీస్ స్టేషన్ పరిధుల్లో గల కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో భారీ ఆపరేషన్ నిర్వహించి 20 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఐఎన్‌ఎస్ ఎఎస్, ఎస్‌ఎల్‌ఆర్ 303 వంటి ఆయుధాలు, గ్రెనేడ్లు, బుల్లెట్లు, కమ్యూనికేషన్ పరికరాలు, డిజిటల్ డేటా సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. మావోయిస్టులు అటవీ ప్రాంతంలో ఐఈడీలు అమర్చి ప్రజలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడంపై పోలీసుల నిఘా పెంచి, సిఆర్‌పిఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులతో కలిసి కూంబింగ్ చేపట్టామన్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు చిన్న చిన్న గ్రూపులుగా విడిపోయి పారిపోతున్నట్టు సమాచారం అందడంతో మూడు విడతలుగా మావోయిస్టులను అరెస్టు చేసినట్టు చెప్పారు. అందులో భాగంగా మే 16న వెంకటాపురం వద్ద ఆరుగురు మావోయిస్టులు అరెస్టు కాగా.. 17న ఉదయం వాజేడు మురుమూరు అటవీ ప్రాంతంలో ఏడుగురు, కనాయిగూడం, గంగారం గుత్తికోయ గ్రామ సమీపంలో ఏడుగురు మావోయిస్టులను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ 20 మందిలో డివిజన్ కమిటీ సభ్యుడు (డివిసి) ఒకరు, ఏరియా కమిటీ సభ్యులు (ఎసిఎం) ఐదుగురు, పార్టీ సభ్యులు (పిఎం) పద్నాలుగు మంది ఉన్నారని, వీరంతా గతంలో పలు తీవ్రమైన నేరాల్లో పాల్గొన్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా 2017 నుంచి 2024 వరకు జరిగిన అంబుష్ దాడులు, ఐఈడి పేలుళ్లు, ఆయుధాల దోపిడీలు వంటి క్రిమినల్ ఘటనల్లో వీరి ప్రమేయం ఉన్నట్టు తెలిపారు. మావోయిస్టు నాయకులు, సభ్యులు ప్రభుత్వ సరెండర్ పాలసీని వినియోగించుకుని సమాజంలోకి వచ్చి శాంతియుత జీవితం గడపాలని కోరారు. ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని, సహాయం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎనిమిది మంది లొంగుబాటు

ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న ఎనిమిది సభ్యులు శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శబరీష్ సమక్షంలో లొంగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'పోరుకన్నా ఊరు మిన్న-మన ఊరికి తిరిగి రండి' అనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభావితమై హింసామార్గాన్ని వీడి ప్రశాంత జీవితం వైపు అడుగులు వేశారని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారికి 24 గంటల్లోపు రివార్డు నగదు పంపిణీ, వైద్య చికిత్స, పునరావాసానికి ప్రభుత్వ సహాయం, ఇతర అవసరాలకు శాశ్వత మార్గదర్శనం, తక్షణ సహాయంగా రూ.25 వేల చొప్పున అందజేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏటునాగారం ఎస్‌పి ఉపాధ్యాయ, ములుగు డిఎస్‌పి నలువాల రవీందర్, వెంకటాపురం సిఐ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



చికిత్స వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

నిమ్స్‌లో ఇద్దరు చిన్నారులకు గుండె దడ శస్త్ర చికిత్స

- అత్యంత క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా చేసిన వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్న వయసు పిల్లల్లో వచ్చే తీవ్రమైన గుండె దడ చికిత్సలో నిమ్స్ ఆస్పత్రి మరో ముందడుగు వేసింది. ఇద్దరు చిన్న పిల్లలకు (నిమ్స్కార్డియాలజీ), ఎమ్‌డి, డిఎం డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ (ఎలెక్ట్రోఫిజియాలజీ ఫెలోషిప్ నేతృత్వంలో అత్యంత క్లిష్టమైన రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ ప్రక్రియలను విజయవంతంగా నిర్వహించి వారి ప్రాణాన్ని కాపాడారు. ఖమ్మం జిల్లాకు చెందిన 15 యేళ్ల బాలుడు చిన్ననాటి నుంచి తరచూ గుండె దడ, ఛాతీ నొప్పి, చెమటలు వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. మందుల వాడుతూ.. దీర్ఘకాలికంగా చికిత్స తీసుకుంటున్నా ఎటువంటి ఉపశమనం పొందలేకపోయాడు. అతనికి హృదయం, ముఖ్య అవయవాల తారుమారు స్థానాలతో కూడిన అసాధారణ శరీర నిర్మాణం (డెక్స్ట్రోకార్డియా), సైటస్ ఇన్వెర్సస్ ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. గుండె దడకు కారణం వోల్ఫ్-పార్కిన్సన్-వైట్ సిండ్రోమ్ అని, హృదయంలో అదనపు విద్యుత్ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఎకోకార్డియోగ్రఫీ, కార్డియాక్ సీటీ వంటి పరీక్షలు తర్వాత ఎలెక్ట్రోఫిజియాలజీ స్టడీ నిర్వహించారు. చిన్న వయస్సు, అసాధారణ కుడి వైపు హృదయ నిర్మాణం, కాథెటర్ల అమరిక, అనేక అసాధారణ విద్యుత్ వలయాల ఉనికి వంటి ఎన్నో సవాళ్లను 3డి మ్యాపింగ్ ద్వారా నిమ్స్ నిపుణుల సుదీర్ఘ అనుభవంతో అధిగమించారు. ఈ అసాధారణ విద్యుత్ మార్గంతోపాటు ఇంకొక దడ పుట్టించే విద్యుత్ వలయాన్ని విజయవంతంగా ఆర్‌ఎఫ్ఎ ద్వారా తొలగించినట్టు డాక్టర్ చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన 14 ఏళ్ల విద్యార్థి నాలుగు నెలల్లో 25 కంటే ఎక్కువ సార్లు గుండె దడ ఇబ్బందికి గురయ్యాడు. ప్రతిసారీ అత్యవసర చికిత్స అవసరమయ్యే స్థితి. అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగాక నిమ్స్‌కు వచ్చాడు. ఎలెక్ట్రోఫిజియాలజీ స్టడీలో ఇతని ఎడమ హృదయ భాగంలోని మైట్రల్ వాల్వ్ సమీపంలో అసాధారణ విద్యుత్ కేంద్రం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఇది చిన్న పిల్లల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. 3డీ మ్యాపింగ్ సాయంతో ఆ కేంద్రాన్ని ఆర్‌ఎఫ్ఏ ద్వారా తొలగించారు. ఇలా ఇద్దరు చిన్నారులకు శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ చికిత్స రాష్ట్ర ఆరోగ్యశ్రీ, సీఎం సహాయనిధి ద్వారా ఉచితంగా నిర్వహించినట్టు డాక్టర్లు తెలిపారు. వైద్యుల బృందం డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ అజేయ, డాక్టర్ మౌనికా, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనురాగ్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రమీలా, రామారావు, నర్సింగ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్‌ల భాగస్వామ్యంతో విజయవంతమైనట్టు డాక్టర్ సాయి సతీష్ తెలిపారు.

డల్లాస్‌లో బిఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అమెరికాలోని డల్లాస్‌లో జరగనున్న బిఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరు కానున్నారు. పది రోజుల పాటు మరిన్ని నగరాల్లో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు బిఆర్‌ఎస్ అమెరికా విభాగం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ అవిర్భావ వేడుకలతో పాటు సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బిఆర్‌ఎస్ అమెరికా విభాగం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పేర్కొంది. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ అమెరికా విభాగం ఇప్పటికే లాస్ ఏంజెలిస్, కాలిఫోర్నియా, అట్లాంటా, జార్జియా, వాషింగ్టన్ డిసి వంటి నగరాల్లో సన్నాహక సమావేశాలను విజయవంతంగా నిర్వహించింది. రానున్న పదిహేను రోజుల్లో అమెరికాలోని ఇతర కీలక నగరాలు, రాష్ట్రాల్లో బీఆర్‌ఎస్ స్థానిక విభాగాలు సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నాయి. న్యూజెర్సీ, బే ఏరియా (కాలిఫోర్నియా), చికాగో, హ్యూస్టన్, డల్లాస్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఈ సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్టు బీఆర్‌ఎస్ యుఎస్‌ఏ విభాగం వెల్లడించింది.